
# పిచ్చికుక్క


— బలివాడ కాంతారావు

పేరుకు అది గోపాలపట్నం కానీ నిజానికది పట్నం కాదు. పెద్ద పల్లెటూరనే చెప్పవచ్చు. ఉన్నది మ్యునిసిపాలిటీగానీ అదొక పంచాయితీయే! ఒకప్పుడు గోవుల మందలుండేవేమో! ఎవరో గోపాలుడు కాసేవాడేమో? ఇప్పుడు అక్కడ గోవులు అంతగా కనపడవు.



గోపాలుడు లాంటి వాడెవడో యింతవరకు పోలికకు దొరకలేదు. మనుషులు మాత్రం శాంతి కాములు. అందుకే పోలీసు థాణాలో వున్న నలుగురూ పగలు కూడా పనిలేక నిద్రపోతుంటారు. వున్న రెండు తుపాకులు కాదు కదా లాఠీలైనా యెప్పుడూ వాడినట్లు గుర్తులేదు. దక్షిణం నుంచి ఐదు కిలోమీటర్లలో వున్న సముద్రం నించి గాలి వీస్తుంది. ధూళీ, దుమ్మూ ఒకప్పుడు వూరిమధ్య రోడ్డులో వాహనాల కదలిక వలన యెగిరేది గానీ యీ మధ్య వూరికి దూరంగా వచ్చిన 'బైపాస్' రోడ్డువలన లారీలు వూరిలోనికి రావటం లేదు. అంచేత మనుషులకు రోడ్డంతా స్వంతం చేసుకుని స్వేచ్ఛగా నడవడం అలవాటైపోయింది. కొద్దిగా లోనికి వున్న దుకాణాలు కూడా రోడ్డుమీదకే వచ్చేసాయి. అలజడిలేని వూరు యిప్పుడు పదవీ విరమణ చేసిన పింఛనీ దార్లను ఆకర్షించింది. అందుకే అక్కడక్కడ కొత్త యిళ్లు లేచాయి. వూరికి తూర్పు చివర్లో ఐదు ఎకరాల స్థలంలో మూడుతరాలుచూసిన రాజావారి కోట వుంది. వెల్లకు నోచుకోని మధ్యలోవున్న ఆ భవనం పాడుపడినట్లు కనిపిస్తుంది. గానీ అందులో రాజా జగదీశ్ అశ్వపతి గారింకా నివాసం చేస్తున్నారంటారు. ఆయన సాధారణంగా బయటకు కనపడరు. ఒకప్పుడు మంచి ఆల్‌షేషియన్ కుక్కలుండేవట. ఇప్పుడు ఆ పాత వైభవానికి చిహ్నంగా వూర్లో యెవరి దగ్గరాలేని ఒక తుపాకీ వుందని వూరంతటికీ తెలుసు. అందుకే వూర్లో యెవరూ ఆ చుట్టుపట్లకు వెళ్ళరు. **పిచ్చాడి చేతిలో** రాయిలా ఆ తుపాకీతో ఆ ముసలిరాజు పేల్చేసినా పేల్చేస్తాడన్న భయం. జమీందారీ భరణాలులేవు. తుపాకి బలిపిస్తున్నాడు గానీ ఆ **ఐదు ఎకరాలల్లో** ఒక ఎకరా ఐనా అమ్మితే కొందరు యిల్లయినా కట్టుకునేవారు. అతను యిపటి పాడి అన్నం బదులు **పంచభక్ష్యపరమాన్నాలతో**తినేవాడు కదా! తిక్కమనిషి కాకపోతే గతవైభవాన్ని నెమరిస్తూ చూస్తూ మురిసిపోతే ఆ మెడ పట్టిపోదూ!

ఈ రాజా బహద్దూర్‌గారికి రాజసాన్ని యెదిరించే వాళ్ళెవరూ యింతవరకు యీ వూరికి రాలేదనుకుంటే ఒకడు యెన్నోవందల మైళ్ళ దూరం నుంచి ఈ వూరికి వచ్చాడు. వేసవిలో కొబ్బరి బొండాలు తాగి రోడ్డు మీదకే విసరే ఈ వూరి మనుషుల్ని చూసాడు. వాటిని ఆక్సిం చుకుని సైకిళ్ళుతొక్కే సోమరులను చూసాడు. ఒకడి తరువాత యింకొకడు ఆ బొండాలను గుద్ది కిందపడితే చూస్తూ నవ్వేవారే గానీ యెవర్షూ ఆ కొబ్బరి బొండాలను ప్రక్కకు తొయ్యలేదు. ఈ పరిస్థితిని చూసి యువకుడు యీ వేణు గోపాలరావు తను మొదలు పెట్టిన పనిలోనికి ఈవూరి వాడిని ఒక్కర్ని తీసుకోలేదు. తనకు సహాయంగా తన వూరి వాళ్ళను తెచ్చుకున్నాడు. తూర్పున వూరికి యెడంగా రాజావారి కోట వుంటే, పడమట వూరికి యెడంగా యీ గోపాలుడు యిల్లు కట్టించాడు. కోటకు మించిపోయింది. కంటికి మనోహరంగా వుంది. ఈ యిల్లు చుట్టూ ప్రహరీగోడంతా కొన్ని వందల మైళ్ళ దూరం నుంచి మనుషులను రప్పించి కట్టించాడు. అదే యిప్పుడు కొత్తకోట అన్న పేరును ఆ వూర్లో సార్థకం చేసుకుంది. ఆ తోట కాపలాకు వస్తాదుల్లాంటి వాళ్ళ మనుషులే తెచ్చుకున్నాడు. కొత్తకోటలో మనుషుల మాటలకన్నా రెండు అల్సేషియన్ కుక్కల అరుపులే వినిపిస్తుంటాయి. ఆ దరిదాపుల్లోనికి వెళ్ళడానికి అందరికీ భయమే. గోపాలుడు బ్రతకనేర్చిన వాడు కాబట్టి యిన్నాళ్ళూ యెవరికంటా పడని ఒక నిక్షేపం కనుగొన్నాడు. అదీ ఒకసారి యీ వూరికి కొంత దూరంలో వుత్తరాన నడుస్తున్న రైలు మార్గంలో పయనిస్తూ కనుగొన్నాడు. స్టేషనుకు వుత్తరానికి ఒక కొండ. అది నల్లజనపరాయి అని తట్టింది. తరువాత పరీక్ష చేస్తే నిజమని తేలింది. దానికి మంచి గిరాకీ వుంది. లైసెన్సు తీసుకున్నాడు. తొలిసారి కొండను పేల్చినప్పుడు వూర్లో బాంబు




పడిందేమోనని అందరూ తల్లడిల్లి లేచి పోయారు. ఈ రాళ్ళను కొట్టి ముక్కలు చేసే బలవం తులు యీ వూళ్లో లేరని తెలుసు. కొండ యెక్కి అటుప్రక్క చూస్తే కొండల్లో మనుషుల కదలిక కనిపించింది. ఆ యేజన్సీ ప్రాంతంలో ఒక కొండ దొరని పట్టుకున్నాడు. కుటుంబా లతో తరలివచ్చిన పనివాళ్ళకు పనిజరిగే చోటుకు దగ్గరగానే పాకలు వెయ్యించి మరీ యిచ్చాడు. ఇదివరకు వాళ్ళు యెరగని కూలి యిచ్చాడు. కడుపునింపాడు. వీళ్ళు ఈ వూరిలోనికి వస్తే వీళ్ళ సోమరితనం అంటుకుంటుందని తిమబడి వస్తువులు వగైరా అక్కడకే సరఫరా చేసాడు. వీళ్ళకిన్ని ఆశలు లేవు. కడుపునిండితే చాలు.ఆ లసట లేదు. వెలుతురులో పొందని సుఖం చీకటిలో పొందుతారు.

ఈ వూరికి ఈ కొత్త కోట వచ్చినా పాత కోటను మరచిపోలేని ప్రజ అటు వేపే వెళ్తున్నారు. ఆ రాజావారి ఆ తెల్లటి మీసాలు. చెమ్కీ తల పాగాతో కనిపిస్తే సాష్టాంగ పడ్డవాళ్ళు వున్నారు. ఇప్పుడువచ్చిన ఒక వుపద్రవంతో ప్రజ కొత్తకోటకు వెళ్ళలేదు. పోలీసు ఠాణాకు వెళ్ళలేదు. మ్యుని సిపల్ పెద్ద దగ్గరకూ వెళ్ళలేదు. వెళ్తే వాళ్ళపని కాదని వాళ్ళ దృఢ నమ్మకం. పనిచేసి చూపిం చేవాడు రాజావారే! ముసలి సింహం. జూలు ఆడిస్తే చాలు! పోలీసుల దగ్గర తుపాకీలున్నా యని వాళ్ళకి తెలుసు. వాళ్ళు అవి మనుషుల మీదే వాడతారని మరీ తెలుసు. గోపాలుని దగ్గర తుపాకి వుందో లేదో తెలీదు. ఉన్నావాడు దగ్గ రకు రానివ్వడు. వాడికన్నా వాడి కుక్కలే రానివ్వవు. రాజావారి దగ్గర తుపాకి వుంది. ఆ రోజుల్లో పిట్టల్ని కొట్టాడు. ఆ తుపా కితో చిరుత పులిని చంపాడు కదా! రోడ్డు అటూ – యిటూ తుప్పలు తప్పకుని రాజావారిం టికి వెళ్ళవచ్చు. ఆ తుప్పల నించి పాములూ, జెర్రులూ పైకి రాకుండా చూసుకుంటూ వెళ్తే చాలు. అందుకే అతని దగ్గరకే వెళ్ళి తలుపు తట్టారు.

"మహాప్రభో! మీరే మమ్మురక్షించాలి" అన్నారు ఏక కంఠంతో.

"ఏమైంది?"

"ఎన్నడూ యీ వూర్లో పిచ్చికుక్క తిరగటం యెరగం. వారం రోజులై ఒక పిచ్చి కుక్క తిరు గుతోంది. ఇప్పటికి యిద్దరిని కరిచింది"

"మ్యునిసిపాల్టీ వాళ్ళ దగ్గరకు వెళ్ళండి"

"వాళ్ళు దోమలంటేనే పట్టించుకోరు – పిచ్చి కుక్కల్ని పట్టుకుంటారా?"

"మీరే నలుగురు కర్రలు పట్టుకుని కాసి చంపేయండి"

"మమ్మల్ని కరిచేస్తే – మా పెళ్ళాం పిల్లల గతేంగాను ప్రభూ?"

"ఇంజక్షన్లు యిప్పించుకోండి"

"అంత దూరం పట్నం వెళ్ళడానికి – యింజ క్షన్లు యిప్పించుకోడానికి అంత డబ్బెక్కడిది రాజా?"

"అయితే నన్నేం వెయ్యమంటారు?"

"మీ దగ్గర తుపాకి వుంది. మీకు గురి వుంది. అందులో ధైర్యం మీ రాజవంశం సొత్తు. ఒక్కసారి 'ఢాం'మనిపించేస్తే పిచ్చికుక్క సఫా అయిపోతాది"

రాజావారి ధైర్యం గురించి వీళ్ళు అంటుంటే తనకు నిజంగా ధైర్యం వచ్చేసింది. వెయ్యి కాస్త వణుకుతుందిరా అని చెప్పడానికి మనసంగీకరిం చలేదు.

"మీ వెంట యెవ్వరూ అక్కర్లేదు. తమరొ క్కరు చాలు. రక్షించండి రాజా! మా ప్రభువులు తమరే – తమ వంశం సూర్యవంశం..."

రాజావారు కాస్సేపు మౌనం వహించారు. కళ్ళు మూసుకుని ఆలోచించాక మీసం త్రిప్పకున్నారు.

"ఏ రంగు కుక్క?"

"నలుపు రంగట?"

"ఏ వీధిలో తిరుగుతోంది?"

"ముందు రేఖాన వీధిలో పిచ్చికేకలవినిపిస్తుందట. అక్కడ మంచి దాని యిష్టం. పిచ్చికుక్కకు ఫలాన త్రోవని వుంటుందా?"

"పెంపుడు కుక్కా?"

"కాదు బాబూ? ఊరకుక్కట. ఎవరు తిండి పెట్టే అక్కడే కాపలా కాసుకుని వుండేదట. అలాంటి విశ్వాసంతో వున్నది పిచ్చిదిగా మారక పోతే మనుషుల్నే కరుస్తాదా?"

"సరే!వెళ్ళండి. ఈ రాత్రి అర్ధరాత్రికి నేను దానికి వేటేస్తాను. ప్రజలెవరినీ వీధిలో తిరగవద్దని చెప్పండి" అని రాజావారు హామీ యిచ్చారు. ఈ వార్త వూరంతా ప్రాకిపోయింది "ఎంతైనా అత నిలో ప్రవహించేది రాజరక్తం కదా" అని మధ్య తరగతి వాళ్ళు అనుకుంటే "రాజూరాజే – ఎంత యేలుదామన్నా మామ్మూలు వాళ్ళు రాజులెలా అవుతారని" పామరులు అనుకున్నారు.

ఆ రాత్రి పిచ్చికుక్క చచ్చిపోయిందని వూరంతా తెల్లారేసరికి గుబ్బుమంది. రాజావారు రక్షించా రని వూరంతా వెయ్యి నోళ్ళతో పొగిడారు. రాజావారు ప్రజలకు దర్శనమీయలేదు. "నా పని నేను చేసాను – అంతే! వెళ్ళండి" అని లోనించే అరిచాడు. పనికొచ్చిన పనిచేసి పట్నాన్ని కాపాడారు. రాజావారిని కీర్తించుకుంటూ వెళ్ళిపో యారు. ప్రజ భయం లేకుండా తిరుగుతున్నారు. "ఆ కుక్క మా కుక్కే – అది పిచ్చి కుక్క కాదని" చచ్చిన కుక్కను చూసిన ఒక పదేళ్ళ అబ్బాయి యేడుస్తూ అంటే" "నయం! నీ కుక్క అంటున్నావు. నిన్ను కరిస్తే కష్టం తెలుసుండేది. రాజావారు రాత్రంతా మేల్కొని అంత కష్టపడి పిచ్చికుక్కను చంపితే మంచి కుక్కను చంపా డంటావేమిటి? నీకు బుద్ధిలేదా?" అని కసిరిన వాళ్ళే – నాలుగు రోజులు తరువాత మళ్ళా పిచ్చికుక్క అరుపు విన్నారు.

"ఆ పిచ్చి కుక్క యెన్ని మంచి కుక్కలను కరిచిందో? అందులో ఒకటి పిచ్చిదై వుంటుంది" అన్నారు. రెండో రోజు యింకొకర్ని కరిచింది. "వెర్రి కుక్క వూరొదలి మనువుకు వెళ్ళి మళ్ళీ వెర్రి వెంకమ్మలా తిరిగొచ్చిందని" కొందరు పరి హాసమాడారు. మళ్ళీ ప్రజ యేలినవారి దగ్గరకు పరుగెత్తారు. కష్టం విన్నవించుకున్నారు. తలవంచి కోరుకుంటే కాదనలేని తన తాతలనాటి తత్వం యింకా తనని వదల్లేదు.

ఆ రాత్రి పిచ్చికుక్కను చంపేసాడు. అది ఆ పిచ్చి అరుపు అరుస్తూనే చచ్చిపోవటం తెరచిన కిటికీ నించి కొందరు చూసారు. ఊరంతా హాయిగా నిద్దరపోయింది. రెండు వారాలు దాటినా మళ్ళీ పిచ్చి కుక్క అరుపే వినపడ లేదు. ఊరుమీదకు వచ్చిన పెద్దపులిని చంపిన వీరునిలా ప్రజల మన్ననలను పొందడమే కాదు యీ వార్త వూరుదాటి యెక్కడెక్కడికో వెళ్ళిపో యింది. రాజావారు యింకా మీసాలు దించ కుండానే ఒక రాత్రి ఒకడు తలుపు తట్టాడు. తలుపు తెరవకుండా యెవరని కేకవేసాడు. ఆ గొంతుకలో ఆతృత – ఆవేశం – ప్రార్ధన వున్నది.

"రాజావారి సేవకుడ్ని! ఆపదలో వున్నాను"

తననింకా గుర్తు చేసుకునే సేవకులు యింకా వున్నారా అని రాజావారు ప్రసన్నహృదయులై తలుపు తీసారు. చంచయ్య బలిష్టమైన యువకుడు పాష్టాంగపడి.

"తమరు యీ వూర్లో పిచ్చికుక్కను చంపారు. మా పాకల్లోకి ఒక పిచ్చికుక్క చొరబడింది. కాల్చేయండి రాజా – కాల్చేయండి" విన్నవించుకుంటే రాజావారు లైటు వెలుగులో కనపడే ఆ కండలు తిరిగివున్న యువకుడ్ని చూసి

"ఎక్కడ మీ పాకలు?"

"ఆ కొండవార...." అంటూ అటు చూపించాడు. రాజావారికి బ్రహ్మాండమైన తిక్కకోపం వచ్చి అరిచాడు. "పిచ్చికుక్కలను చంపడమే నా పనా? నేను రాజాను. నీకు సిగ్గులేదా? కండలు తిరిగిన ఒళ్ళు పెట్టుకున్నావు. ఒక కర్ర పట్టుకుని ఆ పిచ్చి కుక్కను చంపలేవూ? పోరా–పో" అని గసిరి చప్పన 'ధాం'మని తలుపు వేసుకున్నారు రాజావారు.

"కనికరించండి – ఆ తుపాకైనా యివ్వండి"

లోనించే రాజావారు సింహగర్జన చేసారు.

"నీ మొఖానికి ఒక తుపాకా? నేనొక బహుమతి వుంచాను. ఈ వూర్లో అది యిద్దామంటే ఒక్క వీరుడూ తారసపడలేదు. ఆ పిచ్చికుక్కను చంపిరారా! నీదే ఆ బహుమతి"

రొప్పకుంటూ చెంచయ్య తిరిగి వెళ్ళిపోయాడు.

ఇంకా సరిగ్గా తెల్లవారలేదు. రాజావారు ఆ పాత తాతలనాటి వాలు కుర్చీమీద కూర్చుని వున్నారు.

ఎవరో తలుపు తట్టారు. విసుగుతో తలుపు తెరిస్తే యిద్దరు పోలీసులు యెదురుగా నిల్చున్నారు.

"ఏం వచ్చారన్నాడు" రాజదర్పంతో.

"రాత్రి ఆ కొండవాడు చెంచయ్య మీ యింటికి వచ్చాడు కదూ!"

"వచ్చాడు"

"వాడు చంపేసాడు"

"భేష్" అంటూ ఒక్క గెంతు గెంతి గబగబ గోడకున్న తుపాకి తీసి పోలీసుల వేపు గురిచేసి వస్తుంటే వాళ్ళు భయంతో పక్కకు తప్పకున్నారు.

"ఏడీవాడు? ఆ పిచ్చి కుక్కను చంపితే బహుమానం యిస్తానన్నాను. ఈ తుపాకిని బహుమానంగా యిస్తాను. లోపలికి రమ్మనమనండి"

పోలీసులకు ధైర్యం వచ్చి

"వాడు పిచ్చి కుక్కను చంపేలేదండీ!"

"మరి దేనిని చంపాడు?"

"మనిషిని చంపేసాడు"

"మనిషినా?'

"త్రోవకాచివాడిని కుదేసి పెద్ద బండరాయితో వాడి బుర్ర బద్దలు చేసాడు"

"హా... ఆ చచ్చిన వాడెవడు?"

"అవతలి కోటలో వున్న వేణుగోపాలరావు"

"ఎందుకంత పని చేసాడు?"

"వాడు యీ మధ్యవాళ్ళని నానా అల్లరి పాలు చేస్తున్నాడటండీ"

"చంపే బదులు – పోలీసుల దగ్గరకు రాలేదా?"

"అలాంటి ప్రశ్నలు మాకు వెయ్యకండి. జవాబు తెలిసినా చెప్పలేం. మీరే వూహించుకోండి రాజా"

"చంపవలసినంత ఘోరం యేం చేసాడయ్యా అతగాడు?"

"నిన్న రాత్రి వాడి ముఠాతో పది వాళ్ళ పాకల్లో దూరి వాళ్ళ పడుచు ఆడవాళ్ళను రేప్ చేసాడటండీ"

"మానభంగమే? రక్షింపవలసింది బదులు భక్షించాడా? అందుకే వాడ్ని పిచ్చికుక్క అని చెంచయ్య అన్నాడు. నా కోపంతో నేను సరిగ్గా అడిగి తెలుసుకోలేకపోయాను" అన్నాక రాజావారు వుదాసీనంగా.

"ఇప్పడు నన్నేం చెయ్యమంటారు?"

'మీరు ప్రాసిక్యూషన్ తరపున ముఖ్యమైన సాక్షి"

"నేనూ ఒక వీధి కుక్కను పిచ్చికుక్క అనుకుని నా తుపాకితో కాల్చేసాను. అసలు దోషిని నేను. నన్నూ అరెస్టు చెయ్యండి" అన్నారు రాజావారు ఆవేశంతో.

"ఇది కుక్కల రాజ్యం కాదు ప్రభూ! మనుషుల రాజ్యం" అన్నాడు పోలీసు. *

